చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

వీరవాసరం: వేసవిలో చలివేంద్రాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని భీమవరం ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు అన్నారు. రాయకుదురులో శ్రీకృష్ణదేవరాయ నాటక కళాపరిషత్ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం లింగారాం సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. వేసవి దాహార్తిని తీర్చుకునేందుకు చలివేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గెద్దం భారతీ భాస్కర్‌రావు, వైస్ ఎంపిపి అడ్డాల రాము, గోపాలకృష్ణ, తానాల ప్రసాద్, గుడాల శ్రీనివాసరావు, అడ్డాల బాబి, పోలిశెట్టి చంటి పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బాబు

'కొల్లేరు'లో దాహం తీరేదెలా..!

లంక గ్రామాల్లో తాగేందుకు గుక్కెడు నీళ్లు కరువు
కొనుగోలు చేస్తేనే గొంతు తడిచేది
తాగునీటి పథకాల ఏర్పాటులో తాత్సారం
విచ్చలవిడిగా ఆక్వా చెరువుల తవ్వకాలు
తాగునీటి చెరువులకు మాత్రం అనుమతులు నిల్
వేసవిలో పరిస్థితి మరీ దారుణం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొల్లేరు గ్రామాల ప్రజలు గుక్కెడు నీళ్ల కోసం అల్లాడిపోతున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఏళ్ల తరబడి తాగునీటి కోసం కొల్లేరు ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఆక్వా చెరువుల తవ్వకాలతో తాగునీటి కోసం కొల్లేరు ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. కొల్లేరు గ్రామాలకు తాగునీటి పథకాలు మంజూరు చేస్తున్నట్లు కాగితాల్లో చూపించడం తప్ప వాటిని అమల్లోకి తెచ్చే పరిస్థితి లేకుండాపోయింది. ఏలూరు జిల్లాలో ఉంగుటూరు, దెందులూరు, కైకలూరు నియోజకవర్గాలు కొల్లేరును ఆనుకుని ఉన్నాయి. కొల్లేరులో దాదాపు 130కిపైగా లంకగ్రామాలు ఉన్నాయి. ఐదు లక్షలకుపైగా జనాభా ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. లక్షల జనాభాకు తాగునీరు అందించేందుకు ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోని పరిస్థితి నెలకొంది. దీంతో కొల్లేరు గ్రామాల ప్రజల తాగునీటి ఇబ్బందులు తారాస్థాయికి చేరాయి. గడగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు ఎంఎల్ఎలను నిలదీస్తున్న పరిస్థితి ఏర్పడింది. దీంతో ఇటీవల జరిగిన డిఆర్‌సి సమావేశంలో కొల్లేరు గ్రామాల్లో తాగునీటి సమస్యపై ఎంఎల్ఎలు పుప్పాల వాసుబాబు, దూలం నాగేశ్వరరావు, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ ఏకరువుపెట్టారు. ఆగడాలలంకలో రూ.29 కోట్లతో తాగునీటి స్కీము ప్రకటించినా ఇప్పటికీ ఒక్క అడుగూ ముందుకు పడలేదు. మరో గ్రామంలో రూ.నాలుగు కోట్లతో తాగునీటి పథకం ప్రకటించినా అది ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా తయారైంది. దీంతో ప్రజలు దూరప్రాంతాలకు వెళ్లి తాగునీరు కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. కొన్ని గ్రామాల్లో స్నానం చేయడానికి నీళ్ల పనికిరావడం లేదని ప్రజాప్రతినిధులే చెబుతున్న పరిస్థితి ఉంది. దీన్నిబట్టి కొల్లేరులో తాగునీటి సమస్య ఏవిధంగా ఉందో వేరే చెప్పనక్కర్లేదు.

ఆక్వా చెరువులు తవ్వేస్తారు.. తాగునీటి చెరువులకు అనుమతి లేదంట..!

కొల్లేరు ప్రజల తాగునీటి సమస్యపై ప్రతియేటా వేసవికి ముందు చర్చించడం తర్వాత మరిచిపోవడం షరా మాములు అన్నట్లు తయారైంది. సమావేశాల్లో అది చేస్తాం.. ఇది చేస్తాం అంటూ చెప్పడం, తర్వాత పనులు మాత్రం ముందుకు సాగకపోవడం సర్వసాధారణమైంది. ఆక్వా చెరువుల కారణంగా తాగునీటి వనరులన్నీ కలుషితమైపోవడంతో కొల్లేరు ప్రజల దాహం కేకలు రోజురోజుకీ మిన్నంటుతున్నాయి. కొల్లేరు గ్రామాల్లో ప్రస్తుతమున్న తాగునీటి చెరువులు జనాభాకు సరిపడా లేకుండాపోయాయి. ప్రస్తుతం ఉన్న చెరువుకు ఆనుకుని మరో చెరువు తవ్వుకునేందుకు భూమి కొరత లేదు. అయితే చెరువు తవ్వుకునేందుకు ఫారెస్టు అధికారుల అనుమతి అవసరం. ప్రతియేటా దీనిపై చర్చ సాగుతున్నా ఇప్పటి వరకూ అనుమతులు మాత్రం రాలేదు. కొల్లేరులో అనుమతి లేకుండా ప్రతియేటా వందల, వేల ఎకరాల్లో చేపల చెరువుల తవ్వకాలు సాగిపోతున్నాయి. ప్రజలు అవసరమయ్యే తాగునీటి చెరువుల తవ్వకాలకు మాత్రం అనుమతులు లేవంటూ కాలయాపన చేస్తున్నారు. కొల్లేరులో తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు సరైన ప్రణాళికలు తయారు చేయడంలో విఫలమైనట్లు స్పష్టంగా తెలుస్తోంది. ప్రభుత్వం పట్టించుకోకపోవడం కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాగునీటి చెరువుల కొత్తవి పూర్తయ్యేసరికి సమయం పడుతోంది. ప్రస్తుత వేసవిలో కొల్లేరు ప్రజల దాహార్తి తీర్చేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటారో చూడాల్సి ఉంది. కొల్లేరులో కొత్త తాగునీటి చెరువుల తవ్వకాల ఆర్‌డిఓ, తహశీల్దార్ పర్యవేక్షణ పూర్తి చేసినా ఇటీవల నిర్వహించిన డిఆర్‌సి సమావేశంలో ఇన్‌ఛార్జి మంత్రి పినిపే విశ్వరూప్ తెలిపారు. ఈ వేసవిలోనైనా మాట నిలబెట్టుకుంటారో లేదో వేచిచూడాలి.

178 మంది సచివాలయ ఉద్యోగులకు ప్రొబేషన్ ఖరారు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రెండో విడతలో 2020లో విధుల్లో చేరిన ఉమ్మడి జిల్లాలోని 178 మంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రొబేషన్ ఖరారైంది. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2019లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 9,780 గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం ప్రక్రియ చేపట్టింది. అయితే తొలివిడతలో 7,911 మంది మాత్రమే ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 2019 అక్టోబర్ రెండో తేదీన వీరంతా విధుల్లో చేరారు. వీరికి 2022 జులైలో తొలివిడతగా 7,610 మందికి ప్రొబేషన్ ఖరారైంది. ఇప్పుడు మళ్లీ రెండేళ్ల సర్వీసు, శాఖాపరమైన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన 178 మంది ఉద్యోగులకు ప్రొబేషన్ ఖరారు చేసింది. మొత్తం 8,710 మంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఉండగా ఇప్పటివరకు 7,788 మంది ప్రొబేషన్ ఖరారైంది. ఇప్పుడు రెగ్యులర్ అయిన ఉద్యోగులకు మే నుంచి కొత్త జీతాలు వర్తించనున్నాయి. రెండో విడతలో ప్రొబేషన్ ఖరారైన సచివాలయ ఉద్యోగులకు ప్రొబేషన్ ఖరారు పత్రాలను జిల్లా కలెక్టర్ త్వరలో అందించనున్నారు.

సహకార సంఘాల చట్ట సవరణ రద్దు చేయాలి

ఎపి కోఆపరేటివ్ సొసైటీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు అజయ్‌కుమార్
కలెక్టరేట్ వద్ద సొసైటీ ఉద్యోగుల ధర్నా
కలెక్టర్ ప్రశాంతికి వినతి అందజేత

ప్రజాశక్తి - భీమవరం

సహకార సంఘాలను ప్రయివేటీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన చట్ట సవరణను వెంటనే రద్దు చేసి, సహకార సంస్థలను బలోపేతం చేయడంతోపాటు ఉద్యోగుల భద్రతను కాపాడాలని ఎపి కోఆపరేటివ్ సొసైటీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి.అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ వద్ద జిల్లాలోని అన్ని సహకార సంఘాల ఉద్యోగులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఎండను సైతం లెక్క చేయకుండా కలెక్టరేట్ వద్ద బైఠాయించి నినదించారు. అనంతరం జరిగిన సభకు యూనియన్ జిల్లా అధ్యక్షులు విజయ్‌కుమార్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథి అజయ్‌కుమార్ ప్రసంగిస్తూ కేంద్ర ప్రభుత్వం మోడీ ఒత్తిడితో సహకార చట్టాన్ని సవరించారని, ఈ నిర్ణయం కోఆపరేటివ్ సొసైటీలకు ఉరితాడు వంటిదని ఆరోపించారు. ప్రయివేటు వ్యక్తులకు సంస్థలకు 50 శాతం వాటాలను అప్పగించడం మల్టీ ట్రేడ్ బిజినెస్ పేరుతో రైతులకిచ్చే సహకారం పోతుందని, సొసైటీల పాలకవర్గాల్లో బయట వ్యక్తుల ప్రవేశం జరుగుతుందని, ఏది చాలా నష్టదాయకమని ఆరోపించారు. సొసైటీ ఉద్యోగులను ఐదు సంవత్సరాలకోసారి చేయాల్సిన వేతన సవరణ చేయలేదని, 2019లో ఇచ్చిన జిఒ 36 ఇంతవరకు అమలు చేయలేదని, వెంటనే వేతన సవరణ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆర్‌బికెలను సొసైటీలో కలిపి సొసైటీలను నష్టపర్చే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వం విడనాడాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతంలో రైతులకు సేవా దృక్పథంతో ప్రారంభమైన కోఆపరేటివ్ సొసైటీలను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. రాష్ట్ర పరిధిలోని సహకార చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా జోక్యం చేసుకొని సహకార వ్యవస్థ స్ఫూర్తినే దెబ్బతీస్తున్నారని, దీనిపై రైతులను, ప్రజలను చైతన్యవంతులు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాబోయే రోజుల్లో ఉద్యోగులు, రైతులు, ప్రజలు ఐక్యంగా సహకార వ్యవస్థను కాపాడుకోవడం కోసం పెద్దఎత్తున ఉద్యమానికి సిద్ధపడాలని పిలుపునిచ్చారు. యూనియన్ జిల్లా కార్యదర్శి పి.కృష్ణశాస్త్రి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల పేరుతో సొసైటీలకు నష్టం తెచ్చే విధంగా ఉద్యోగులపై పని ఒత్తిడి పెంచేలా ప్రభుత్వ విధానాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగులందరికీ పెంచిన విధంగా వయోపరిమితి 62 సంవత్సరాలకు సొసైటీ ఉద్యోగులకూ పెంచాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.రాజా రామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వరంగ సంస్థలను, సంఘటిత, అసంఘటిత కార్మికులను కష్టాలు పాల్జేసే విధానాలు అవలంబిస్తున్నాయన్నారు. చట్టాల మార్పు పేరుతో ఉద్యోగ భద్రతకే ప్రమాదం తీసుకొస్తున్నారని, దీనికి వ్యతిరేకంగా అన్ని రంగాల, సంస్థల ఉద్యోగులు, కార్మికులు ఐక్యంగా నిలబడాలని కోరారు. కోఆపరేటివ్ ఉద్యోగుల పోరాటానికి సిఐటియు పూర్తి మద్దతిస్తుందన్నారు. ఉద్యోగుల యూనియన్ జిల్లా కన్వీనర్ పి.నరసింహరాజు, జిల్లా కోశాధికారి పెద్దిరాజు, జిల్లా నాయకులు సత్యనారాయణమూర్తి, శ్రీనివాసరావు, జయరాజు, రామకృష్ణ నాయకత్వం వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ ప్రశాంతికి అందజేశారు. సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం డిసిఒతో జిల్లాలో ఉద్యోగుల సమస్యలపై నేతలు చర్చించారు.

ధర్నాలో నినదిస్తున్న సొసైటీ ఉద్యోగులు, నేతలు

వెంకన్న సాక్షిగా ఇచ్చిన హామీ ఏమైంది

ప్రచార భేరి యాత్రల్లో సిపిఎం, సిపిఐ నేతలు

ప్రజాశక్తి - ఉండి

తిరుపతి వెంకన్న సాక్షిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని నరేంద్ర మోడీ ఇచ్చిన హామీ ఏమైందని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు ప్రశ్నించారు. సోమవారం సాయంత్రం సిపిఐ ఏరియా కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు అధ్యక్షతన స్థానిక మెయిన్ సెంటర్ నుండి చిన్న వంతెన సెంటర్ మీదుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, బాలాజీరావుపేట, మార్కెట్, కాపులపేట మీదుగా ఉండి మెయిన్ సెంటర్ వరకు ప్రచార భేరి ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా బి.బలరాం, కోనాల భీమారావు మాట్లాడుతూ 2014లో కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన వెంటనే విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని తిరుపతిలో వెంకటేశ్వరస్వామిసాక్షిగా నరేంద్ర మోడీ ఇచ్చిన హామీ ఏమైందని వారు ప్రశ్నించారు. విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పోలవరంను జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి దానికి సరిపడా నిధులు కేటాయించలేదని, విశాఖ రైల్వే జోన్, కడప స్టీల్‌ప్లాంట్ వంటి ప్రధాన హామీలను విస్మరించిందన్నారు. రోజురోజుకీ విపరీతంగా పెరిగిపోతున్న పెట్రోల్, గ్యాస్, డీజిల్, వంటనూనె ధరలను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వారు విమర్శించారు. పేదలకు అవసరమైన నిత్యావసరాల ధరలు తగ్గించడంలో లేని చిత్తశుద్ధి ధనవంతులు ప్రయాణించే విమాన ఇంధన ధరలు తగ్గించడంలో చూపిస్తుందని ఎద్దేవా చేశారు. తొమ్మిదేళ్ల బిజెపి పాలనలో దళితులు, గిరిజనులు, మైనారిటీలపై దాడులు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. బిజెపి అధికారంలోకి వస్తే స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేస్తామని చెప్పి అధికారం చేపట్టిన తర్వాత వ్యవసాయ చట్టంలో సమూల మార్పులు చేపట్టారన్నారు. 1926లో కార్మికులు పోరాడి తీసుకొచ్చిన 44 కార్మికచట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించిందని, దీనివల్ల కార్మికుల పని గంటలు పెరిగిపోతాయని అన్నారు. కాంగ్రెస్ హయాంలో గ్యాస్ సిలిండర్ ధర రూ.450 ఉండగా ప్రస్తుతం రూ.1150కు చేరిందని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ముసుగులో ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీల 26 సంక్షేమ పథకాలను రద్దు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్, నాయకులు చీర్ల శేషు, కలిదిండి సూర్యనారాయణరాజు, నిమ్మితి కిషోర్, కింతాడ రమేష్, మజ్జి నాగేశ్వరరావు, కడలి నాగేశ్వర రావు, రామకూరి వెంకట రత్నం, నక్కా వెంకటేశ్వర్లు, నక్కా గోవింద్, బొడ్డుపల్లి ఆదాం, సిపిఐ నాయకులు శ్రీను, పతివాడ గణపతి, పెద్దింటి సింహాచలం, బెవర రామా నాయుడు, నరసింహారావు, వెంకటరమణ పాల్గొన్నారు.

ఆచంట వేమవరంలో మాట్లాడుతున్న కేతా గోపాలన్

ఉండిలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, పక్కనే సిపిఐ జిల్లా కార్యదర్శి భీమారావు

పెనుమంట్ర: ప్రజాస్వామ్య పరిరక్షణకు అంతా కలిసి రావాలని సిపిఎం మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు అన్నారు. సోమవారం పెనుమంట్ర పెదచెరువుగట్టు వద్ద సిపిఎం ప్రచార భేరి నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వ విధానాలను తిప్పికొడితేనే సామాన్య మానవుడి నుంచి అన్ని తరగతుల ప్రజానీకం జీవన మనుగడ సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు బత్తుల విజయకుమార్, నక్క కాంతారావు, కుడిపూడి నాగేశ్వరరావు, మహిళలు పాల్గొన్నారు.

యలమంచిలి: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలు మోడీ నిరంకుశ వైఖరిని వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార భేరి యాత్ర సోమవారం కలగంపూడి, ఏనుగువానిలంక, బాడవ గ్రామాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు బాతిరెడ్డి జార్జి మాట్లాడుతూ ప్రభుత్వ పరిశ్రమలను ప్రయివేటీకరిస్తూ నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. యాత్రలో నాయకులు మాసవరపు సుబ్బారావు, దేవ సుధాకర్, ఫణీంద్ర, రాజేష్, సంతోష్, బాతిరెడ్డి సుగుణ పాల్గొన్నారు.

భీమవరం: ప్రధాని మోడీ రూ.1.50 లక్షల కోట్ల అప్పు చేసి ఎక్కడ అభివృద్ధి చేశారో చెప్పాలని సిపిఐ, సిపిఎం నేతలు చెల్లబోయిన రంగారావు, బి.వాసుదేవరావు ప్రశ్నించారు. ప్రచార బేరియాత్ర పట్టణంలో నాలుగో రోజు సోమవారం రెండోవార్డు అరుంధతి పేట, 21వ వార్డు పెద్దపేట పాండురంగడు గుడి, మెంటేవారితోట, చల్లారావు నగర్ వీధి గుండా సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి ప్రజలపై అనేక రూపాల్లో భారాలు వేస్తుందని, ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో నేతలు డి.త్రిమూర్తులు, ఎం.ఆంజనేయులు, ఎం.వైకుంఠరావు, డి.నాగు, కె.కృష్ణ, నాగరాజు, సాయి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆచంట: సిపిఎం, సిపిఐ ప్రచార భేరి యాత్ర ఆచంట వేమవరంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోపాలన్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపితేనే ప్రజాస్వామ్యానికి మనుగడ సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు గుత్తుల రంగారావు, సిర్రా నరసింహమూర్తి, వాసా రామ్మోహన్రావు కొండేటి సత్యనారాయణ, ఇందుకూరి సూర్యనారాయణరాజు, వెన్నపు ప్రసాద్, కరుటూరి సత్యనారాయణ, రాపాక సత్యనారాయణ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: 'ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బిజెపిని సాగనంపుదాం.. దేశాన్ని కాపాడుకుందాం' అనే నినాదంతో పట్టణంలో నాలుగో రోజు సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార భేరి యాత్ర హౌసింగ్ బోర్డు, గణేష్ నగర్, మిలటరీ కాలనీ, గాయత్రీదేవి సెంటర్, రామారావుపేట, కెఎస్ఎన్ కాలనీల మీదుగా సాగింది. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, సిపిఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు, సిపిఎం పట్టణ నాయకులు కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా, రైతు, కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. ధరలు, నిరుద్యోగం తగ్గిస్తామని చెప్పి వాటిని పెంచుకుంటూ పోతుందని వారు విమర్శించారు. కార్యక్రమంలో జవ్వాది శ్రీను, జవ్వాది శివ, శిద్దిరెడ్డి శేషుబాబు, చిట్టేటి సత్యనారాయణ, పోతు శ్రీను, అల్లం రాము, దాస్యం రాము, రావూరి బాబీ, ఉయ్యూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

తణుకు రూరల్: నియంతలా వ్యవహరిస్తున్న ప్రధాని మోడీని తక్షణం గద్దె దించాల్సిందేనని సిపిఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ఏడో వార్డు ఇందిరమ్మ కాలనీలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో నాల్గో రోజు ప్రచారభేరి యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ నేతలు బండి సత్యనారాయణ, బొద్దాని మురళీకృష్ణ, అప్పారి శ్రీను, కోరాడ సుధీర్‌బాబు, బొద్దాని కృష్ణకిషోర్, పుట్టా అమ్మిరాజు, సిపిఎం నాయకులు కామన మునిస్వామి, గార రంగారావు, రామకృష్ణ, శ్రీహరి, త్రిమూర్తులు, సాంబశివరావు, సూరిబాబు పాల్గొన్నారు.

న్యాయవాదులకు నోటీసులు పౌరహక్కుల ఉల్లంఘనే

ఐలు జిల్లా ప్రధానా కార్యదర్శి కామన మునిస్వామి
విధులు బహిష్కరించిన న్యాయవాదులు

ప్రజాశక్తి - తణుకు రూరల్

న్యాయవాదులకు నోటీసులివ్వడం పౌర హక్కులను ఉల్లంఘించడమేనని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఉభయ జిల్లాల ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి అన్నారు. విజయవాడలో న్యాయవాదులకు సిఐడి అధికారులు నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ సోమవారం తణుకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. అనంతరం ఐలు ఆధ్వర్యంలో న్యాయవాదులు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ న్యాయవాదులకు సిఐడి అధికారులు నోటీసులివ్వడాన్ని తప్పుబట్టారు. బాధితులు న్యాయవాదులకు చెప్పిన విషయాలను గోప్యంగా ఉంచాలని ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 126 తెలియజేస్తుందని, దాని ప్రకారం న్యాయవాదులు ఎవరికీ చెప్పాల్సిన అవసరం లేదని మునిస్వామి అన్నారు. ముద్దాయి చెప్పిన విషయాలను పోలీసులకు, సిఐడి అధికారులకు చెప్పకపోవడం దర్యాప్తునకు ఆటంకం కల్గించడం అనే మాట అవాస్తవమన్నారు. ఐలు రాష్ట్ర అధ్యక్షులు సుంకర రాజేంద్రప్రసాద్, మరికొంతమంది న్యాయవాదులకు ఇచ్చిన నోటీసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, న్యాయవాదులు అనుకూల రమేష్, బార్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి వెన్నపు సుధాకర్, ఎఆర్.రాజేంద్ర, కె.ప్రతాప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న న్యాయవాదులు

స్పందన వినతులు సకాలంలో పరిష్కరించాలి : కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

స్పందనలో అందిన ప్రతి దరఖాస్తునూ నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుండి 209 అర్జీలను అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందనలో అందిన వినతుల పరిష్కారం అర్జీదారులకు సంతృప్తి కలిగించేలా ఉండాలన్నారు. అర్జీలు రీఓపెన్ అయ్యే అవకాశం లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఒకే సమస్యపై రెండోసారి స్పందనలో ఫిర్యాదు రాకుండా సమస్య పరిష్కారంలో అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మండల స్థాయిలో అధికారులు సమస్యను పరిష్కరిస్తే వారు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి రావాల్సిన అవసరం ఉండదని, మండలస్థాయి అధికారులు ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింటు కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, డిఆర్ఒ కె.కృష్ణవేణి, డిపిఒ ఎం.నాగలత, డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, డిఎస్‌పి బి.శ్రీనాధ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

పెనుగొండ పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలి

పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఆంజనేయులు

ప్రజాశక్తి - భీమవరం

పెనుగొండ గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎపి గ్రామ పంచాయితీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అనుబంధం జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.ఆంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి స్పందన కార్యక్రమంలో సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులు గత మూడు సంవత్సరాలుగా వేతనాలు పెంచాలని ఆందోళన చేస్తున్నారన్నారు. వేతనాలు పెంచుతామని చెబుతూనే పంచాయతీ యాజమాన్యం కాలయాపన చేస్తూ వేతనాలు పెంచకుండా పని చేయించుకుంటుందన్నారు. ఈ ఏడాదీ వేతనాలు పెంచాలని అడిగినందుకు 'మీరు మాకు అక్కర్లేదు.. వేరే వాళ్లతో పని చేయించుకుంటాం' అని భయపెట్టి, దుర్భాషలాడటం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. లెక్కల్లో 70 మంది పంచాయతీ కార్మికులు ఉన్నట్లు చూపిస్తూ వస్తున్న ఆదాయంలో రూ.90 లక్షలు వారికే ఖర్చవుతున్నట్టు మాట్లాడటం దారుణమన్నారు. క్షేత్రస్థాయిలో పని చేస్తోంది 39 మందేనని, వారికి ఇవ్వాల్సిన యూనిఫారం, చెప్పులు, ఇతర కాస్మోటిక్స్, గుర్తింపు కార్డులు ఇవ్వడం లేదని విమర్శించారు. గ్రామానికి విఐపిలు వస్తే వారాంతపు సెలవును త్యాగం చేసి డ్యూటీ చేయాల్సి వస్తుందన్నారు. చీపుర్లు, పారలు వంటి పనిముట్లు సొంతంగా కొనుక్కుని పని చేయాల్సి వస్తుందన్నారు. ఇన్ని సమస్యలతో బాధపడుతున్నా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు కనీస సానుభూతి లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జిల్లా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విజయ గంగాధర్, ప్రదీప్, సతీష్, సాహితీ, అనురాధ, లలిత, సత్యవతి పాల్గొన్నారు.



నినదిస్తున్న పంచాయతీ కార్మికులు, నేతలు

దళితుల భూముల్లో తవ్వకాలు ఆపండి : ఎస్‌సి కమిషన్

ప్రజాశక్తి - భీమవరం

యలమంచిలి మండలం చించినాడలో దళిత, పేద కుటుంబాలకు చెందిన లంక భూముల్లో అధికారుల అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని కోరుతూ కెవిపిఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం విజయవాడలో క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.క్రాంతికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు మాట్లాడుతూ చించినాడలో ఎస్‌సి, బిసి కుటుంబాలకు చెందిన 60 ఎకరాల భూములకు 1983లో ప్రభుత్వం పట్టాలిచ్చిందని తెలిపారు. ఆ భూముల్లో వాణిజ్య పంటలు సాగు చేసుకునేవారన్నారు. కోవిడ్ అనంతరం ఆక్వా చెరువుల ప్రభావం వల్ల ఉమ్మడిగా ఆక్వా సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ క్రమంలోనే గోదావరి వల్ల పెరుగు భూమి 10 ఎకరాలు పెరిగిందని చెప్పారు. ఈ భూమిని పేద దళిత కుటుంబాలు ఉపయోగించుకుంటున్నాయని తెలిపారు. అక్కడ భూస్వాములు, అధికారులు అక్రమంగా ఆ 10 ఎకరాల భూమిలో మట్టిని తవ్వి తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. భూస్వాముల చేతుల్లో ఉన్న వందలాది భూములను వదిలేసి కేవలం దళితులు, బిసిలు ఉపయోగించుకునే భూములను మాత్రమే లక్ష్యంగా చేసుకొని అధికారులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. దీనిలో తహశీల్దార్ కీలకంగా ఉన్నారని తెలిపారు. జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని, హైకోర్టులో కేసు వేస్తే స్పందించిన న్యాయస్థానం మట్టి తవ్వకాలను ఆపాలని ఆర్డర్ ఇచ్చిందని తెలిపారు. హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ అధికారులు, ప్రజాప్రతినిధులు పోలీసు పహారా పెట్టి అక్రమంగా మట్టి తవ్వకాలను చేపడుతున్నారన్నారు. దీనిపై ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ స్పందిస్తూ తక్షణం దళితుల భూముల్లో అధికారుల అక్రమ తవ్వకాలను అడ్డుకుంటామని, సమస్య పరిష్కారం కాకపోతే తానే సంఘటనా స్థలానికి వస్తానని తెలిపారు. కార్యక్రమంలో డి.ఫారం పట్టా లంక భూముల డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు గొల్లా ఏడుకొండలు, సొసైటీ సభ్యులు కానేటి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

వినతి అందిస్తున్న నేతలు

అబ్బాయి చెరువు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న సర్పంచి సోమేశ్వరరావు

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

పెదఅమిరం సర్పంచి డొక్కు సోమేశ్వరరావు

ప్రజాశక్తి - కాళ్ల

పెదఅమిరం గ్రామస్తులకు తాగునీటి సమస్య తలెత్తకుండా అబ్బాయి తాగునీటి చెరువు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. నాలుగు రోజుల నుంచి బలహీనంగా ఉన్న చెరువు గట్టును పటిష్టపర్చే పనులు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం ఆయా పనులను గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచి సోమేశ్వరరావు మాట్లాడుతూ గ్రామ చెరువుల్లోకి నీటిని పూర్తిస్థాయిలో నింపుతున్నామన్నారు. కోనేరు చెరువు, కొత్తచెరువు, అబ్బాయి చెరువుల్లోకి నీటిని పూర్తిస్థాయిలో నింపి ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రూ10 లక్షలతో ఫిల్టర్ బెడ్ మరమ్మతులు చేపడుతున్నామన్నారు.

ఫిష్ ఆంధ్రా యూనిట్ల స్థాపనపై సమీక్ష

ప్రజాశక్తి - భీమవరం

ఫిష్ ఆంధ్రా యూనిట్లు త్వరితగతిన గ్రౌండింగ్ అయ్యేలా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్లో కలెక్టర్ జిల్లాలో ఫిష్ ఆంధ్రా యూనిట్ల స్థాపనపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అన్ని కేటగిరీల్లో యూనిట్ల స్థాపనకు లబ్ధిదారులు ఎంపికను త్వరితగతిన పూర్తిచేసి రుణాల మంజూరుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. రూ.50 లక్షల యూనిట్ స్థాపనకు భీమవరంలో గుర్తించిన స్థలాన్ని లీజుకు ఇవ్వడానికి సూత్రప్రాయంగా కలెక్టర్ అంగీకారం తెలిపారు. సమావేశంలో జిల్లా మత్స్యశాఖాధికారి ఆర్‌వివిఎస్ ప్రసాద్, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, మెప్మా పీడీ ఇమ్మాన్యుయేల్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దుర్గేష్ పాల్గొన్నారు.

టెండర్ పేరుతో తొలగింపు అన్యాయం

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఎపి సీడ్స్‌లో కార్మికుల హక్కులు అమలు చేయకుండా చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పి.వి.ప్రతాప్ డిమాండ్ చేశారు. సోమవారం తేతలి వై.జంక్షన్‌లో ఎపి సీడ్స్ వద్ద టెండర్ విధానం రద్దు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతాప్, యూనియన్ అధ్యక్షులు టి.రామకృష్ణ మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా ఉన్న రిజిస్టర్డ్ యూనియన్‌ను ఏకపక్షంగా అధికారులు టెండర్ పేరుతో తొలగించడం అన్యాయమన్నారు. కార్మికులకు ఎన్ని చట్టాలున్నా వైసిపి ప్రభుత్వంలో ఉపయోగం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.త్రిమూర్తులు, రమణ, బి.శ్రీహరి, సాంబశివరావు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - పాలకొల్లు

అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం భారతీయ విద్యా భవన్, గ్రీన్‌ఫీల్డ్ స్కూల్ ఆవరణలో విద్యార్థులు, సిబ్బందికి అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు గృహం వద్ద ఎల్‌పిజి వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, వంటగదిలో గ్యాస్ సిలిండర్ లీక్ అయి అగ్ని ప్రమాదం సంభవిస్తే కార్బన్ డైఆక్సైడ్‌తో ఆర్పే విధానం గురించి చూపించారు. అనంతరం ప్రమాదం జరిగితే మంటలను ఎలా అదుపు చేయాలో విద్యార్థులతో చేయించారు. పెద్ద భవనాలు, గృహాల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే ఫైర్ సర్వీసులకు కాలింగ్ విధానం వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఎంఎస్ఎన్.మూర్తి, ప్రిన్సిపల్ జి.వర్ధక, సిబ్బంది, విద్యార్థులు, సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వైవి జానకీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక అగ్నిమాపక అధికారి ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి జివి.రామారావు, సిబ్బంది ఫైర్ ఎక్స్టింగ్విషర్లను ఎలా ఉపయోగించాలో డెమో చూపించారు.

నేడు పోలీసు స్టేషన్లో వాహనాల వేలం

ప్రజాశక్తి - పాలకొల్లు

పలు కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను ఈనెల 18న పట్టణ పోలీస్ స్టేషన్లో వేలం వేస్తున్నట్లు పట్టణ సిఐ కె.రాంబాబు చెప్పారు. వేలంలో పాల్గొనే వారు ఆధార్ కార్డు జిరాక్స్, వెయ్యి రూపాయలు డిపాజిట్ చెల్లించాలని తెలిపారు. ఆసక్తి గలవారు వేలంపాటలో పాల్గొనవచ్చని తెలిపారు.

పెద్దగరువులో 'జగనన్నే మా భవిష్యత్తు'

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని పెద్దగరువు గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి జగన్ స్టిక్కర్లు అతికించి ప్రభుత్వంపై సర్వే నిర్వహించారు. సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. మరోసారి జగన్‌కు అవకాశం కల్పించి మరిన్ని సంక్షేమ పథకాలు అమలయ్యేలా చూడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి కమిషన్ మెంబర్ చెల్లెమ్మ ఆనంద ప్రకాష్, ఎంపిపి చిట్టూరి కనకలక్ష్మి, మైఖేల్ రాజు, గ్రామ సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

ముస్లిం మహిళలకు వసుధ ఫౌండేషన్ సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు మసీదులో వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద ముస్లిం మహిళలకు నిత్యావసర వస్తువులు, దుప్పట్లు, బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎంఎల్‌ఎ బాబ్జి హాజరయ్యారు. కులమతాలకు అతీతంగా వసుధ ఫౌండేషన్ విద్య, వైద్య రంగాలతో పాటు సేవా రంగంలో తెలుగు రాష్ట్రాల్లో కోట్ల రూపాయలు ఖర్చు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కన్వీనర్ పెన్మెత్స బుద్దరాజు, శ్రీనివాస్‌రాజు, జగపతిరాజు, కావలి నగేష్ పాల్గొన్నారు.

మొగల్తూరులో చలివేంద్రాలు

మొగల్తూరు: వేసవి దృష్ట్యా మొగల్తూరులో సోమవారం చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. మొగల్తూరులోని నాలుగు సచివాలయాల వద్ద, గాంధీ బొమ్మ సెంటర్లో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, పలువురు ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్పందనలో 41 వినతుల స్వీకరణ

ప్రజాశక్తి - నరసాపురం రూరల్

స్పందనలో వచ్చిన ఫిర్యాదులను ఛాలెంజ్‌గా తీసుకుని అధికారులు పరిష్కరించాలని సబ్ కలెక్టరు ఎం.సూర్యతేజ అన్నారు. సోమవారం సబ్ కలెక్టరు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వచ్చిన 41 ఫిర్యాదులను సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ స్వీకరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టరు మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించే విధంగా మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల వినియోగానికి కళ్లెం

పాలకోడేరు: భూసార పరీక్షలతో ఎరువుల వినియోగానికి కళ్లెం పడుతుందని భీమవరం వ్యవసాయ శాఖ డివిజన్ ఇన్‌ఛార్జి ఎడిఎ వి.నారాయణరావు అన్నారు. పాలకోడేరు రైతు భరోసా కేంద్రంలో భూసార పరీక్షలపై సిబ్బందికి సోమవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, ఉద్యానవన సహాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

'జగనన్నకు చెబుదాం' దరఖాస్తులను పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

'జగనన్నకు చెబుదాం'లో వచ్చిన దరఖాస్తులను జిల్లా అధికారులు పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయంలో జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో జిల్లా కలెక్టరు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం పోర్టల్‌ను కొంతమంది అధికారులు ఓపెన్ చేసి చూడడం లేదన్నారు. ప్రతిరోజూ జగనన్నకు చెబుదాం పోర్టల్ ఓపెన్ చేసి సంబంధిత శాఖ అయినట్లయితే ఎస్ అని, కానట్లయితే నో అని కొట్టి సంబంధిత శాఖలకు ఫార్వర్డ్ చేయాలన్నారు. తమ శాఖలకు సంబంధించి దరఖాస్తులు అయితే వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. కొంత మంది తహశీల్దార్లు ఇన్‌కమ్ సర్టిఫికెట్ జారీ చేయడానికి నిర్ణీత సమయం కంటే ఎక్కువ సమయం తీసుకుంటున్నారని, ఇన్‌కమ్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసిన వాటిని పరిశీలించి సర్టిఫికెట్లు జారీ చేయాలని ఆదేశించారు. కోవిడ్ సోకకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని, ఫీవర్ సర్వేలో లక్షణాలున్న వారిని గుర్తించి వారందరినీ టెస్టులు చేసి పాజిటివ్ నిర్ధారణ అయిన వారిని వెను వెంటనే హాస్పిటల్‌కు తరలించి చికిత్స కొనసాగించాలన్నారు. ఆధార్ అప్‌డేట్ పెండింగ్ ఇంకా చాలా ఉందని ఆధార్ అప్డేషన్ అన్ని సచివాలయాల్లో, పోస్టాఫీసుల్లో, బ్యాంకుల్లో త్వరితగతిన జరిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జెసి ఎస్.రామ్ సుందర్‌రెడ్డి, డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, డిపిఒఎం నాగలత, డిఎల్‌పిఒ కెసిహెచ్ అప్పారావు, డిఎస్‌పి బి.శ్రీనాథ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

అగ్ని ప్రమాద బాధితులకు సిపిఎం సాయం

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట వేమవరం పంచాయతీ పరిధి పెదపేటలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచి ఇల్లు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ డిమాండ్ చేశారు. సిపిఎం ఆచంట వేమవరం గ్రామ శాఖ ఆధ్వర్యంలో సిపిఎం ప్రచార భేరి యాత్రలో భాగంగా సోమవారం అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబాన్ని సిపిఎం సభ్యులు పరామర్శించి దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ఆచంటలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని దశాబ్దాల కాలంగా సిపిఎం ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేస్తున్నామని, ఎన్ని ప్రభుత్వాలు మారినా ఆచంటలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయకపోవడంతో ఇటువంటి పేద కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం కల్పించుకుని ఆచంటలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం బృందం సభ్యులు వాసా రామ్మోహన్‌రావు, కె.సత్యనారాయణ మండల కమిటీ సభ్యులు జి.రంగారావు, సిర్రా నరసింహమూర్తి, నాయకులు ఇ.సూర్యనారాయణ రాజు, ప్రసాద్, కె.సత్యనారాయణ, రాపాక సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆసుపత్రి నిర్మాణంపై సమీక్ష

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలో నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామని ఎంఎల్‌శ్రీ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎపిఐఎంసిడి అధికారులతో ఆయన సమీక్షించారు. 100 పడకల ఆసుపత్రి వల్ల నియోజకవర్గ ప్రజలతో పాటు జిల్లా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో డిఇ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్‌సిసి చైతన్యకృష్ణ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

ప్రజాశక్తి - పెంటపాడు

రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సిపిఐ, సిపిఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం డిప్యూటీ తహశీల్దార్ శివశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, సిపిఎం మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, రైతు సంఘం నాయకులు బండారు శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని పొలాలు, పుంతల్లో నిల్వ చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం పది రోజులుగా ప్రకటనలు, రైతు మీటింగ్‌లు పెడుతున్నారు తప్ప గోనె సంచులు సరఫరా చేయడం లేదని, కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదని తెలిపారు. రంధ్రాలు ఉన్న సంచులు, పాతవి పంపిణీ చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. తక్షణం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, పంటకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. రైతులు అమ్మిన ధాన్యానికి 15 రోజుల్లోపు డబ్బులు చెల్లించాలని వారు కోరారు. ఈ సమస్యలపై అధికార యంత్రాంగం స్పందించకపోతే రైతులను సమీకరించి పోరాటాలనే ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొణతాల నాగరాజు, కె.శ్రీనివాస్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో సేవ్ గర్ల్ చైల్డ్ ప్రోగ్రాంపై అవగాహన కార్యక్రమంలో భాగంగా వివిధ పాఠశాలల్లో నిర్వహించిన వ్యాసరచన, డిబేట్, డ్రాయింగ్ తదితర పోటీల్లో విజేతలకు నగదు బహుమతులను జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి సోమవారం కలెక్టరేట్లో అందజేశారు. ఎస్సే రైటింగ్, డిబేట్ డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు ఒక్కొక్క విభాగానికి ప్రథమ బహుమతి సాధించిన వారికి రూ.10,000, రెండో బహుమతి సాధించిన వారికి రూ.5,000, మూడో బహుమతి సాధించిన వారికి రూ.3,000 రూపాయలు అందజేశారు. ఆయా పోటీల్లో మొత్తం 9 మంది విజేతలకు రూ.54 వేల రూపాయల చెక్కులను, ప్రశంసాపత్రాలు, మెడల్స్‌ను జిల్లా కలెక్టరు చేతుల మీదుగా అందజేశారు. అవగాహనా కార్యక్రమాలు నిర్వహించిన యుపి హెచ్‌సి దుర్గాపురం డాక్టర్ లీనా, యుపిహెచ్‌సి తాడేపల్లిగూడెం ఎఎన్ఎంబి జయభారతి, తుందూరు పి హెచ్‌సి ఆశా కె.చిట్టి మార్తకు ప్రశంసాపత్రాలు జిల్లా కలెక్టరు సత్కరించారు. కార్యక్రమంలో జెసి ఎస్.రామ్ సుందర్ రెడ్డి, డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, డిఇఒ ఆర్.వెంకటరమణ, డిఎంహెచ్‌ఒ డి.మహేశ్వరరావు పాల్గొన్నారు.

పున్నయ్య కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి

కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతిబాబు

ప్రజాశక్తి - భీమవరం

జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సుల అమల్లో మండల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో ప్రతినెలా మండలాల్లో జరిగే సివిల్ రైట్స్ డేలను పకడ్బందీగా అమలు చేయాలని జాయింట్ కలెక్టర్ పి.రామ్ సుందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా క్రాంతిబాబు మాట్లాడుతూ 1998లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కెవిపిఎస్ ఆధ్వర్యాన అన్ని దళిత సంఘాలతో కలిపి జస్టిస్ పున్నయ్యతో కులవివక్ష, అంటరానితనంపై రాష్ట్ర వ్యాప్తంగా సర్వే చేశామని గుర్తుచేశారు. సుమారు 360 కుల వివక్ష రూపాలు ఆరోజు బయటపడ్డాయని తెలిపారు. వాటిపై జస్టిస్ పున్నయ్య కమిషన్ కొన్ని సిఫార్సులను ప్రభుత్వానికి అందించిందని గుర్తుచేశారు. చట్టాలపై అవగాహన కల్పించి మనుషులందరూ సమానమే అని సోదరభావం కల్పించాల్సి ఉందన్నారు. నేడు జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులను మండల స్థాయి అధికారులు పూర్తిగా నిర్లక్ష్యంతో విస్మరిస్తున్నారని విమర్శించారు. ఇటీవల పెనుమంట్రలో దళితపేటలో కేవలం విఆర్‌ఒను పంపించి సంతకాల సేకరణ జరిపి సమావేశం జరిగినట్లు చూపించారని విమర్శించారు. మండల తహశీల్దారులకు జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సుల పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. దళితుల పట్ల అధికారుల వైఖరి మార్చుకోవాలని సూచించారు. పెనుమంట్ర మండలంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన తహశీల్దార్‌పై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా జిల్లాలో ప్రతినెలా జరిగే సివిల్ రైట్స్ డే ను పగడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు తనుకుల చంటి బాబు పాల్గొన్నారు.

ఐదుగురికి జరిమానా

తాడేపల్లిగూడెం: కానిస్టేబుల్, ఎఎస్‌ఐ చేస్తున్న విధులకు ఆటంకం కలిగించి అసభ్య పదజాలంతో దూషించిన కేసులో ముద్దాయిలకు రూ.50,000 జరిమానా విధిస్తూ తాడేపల్లిగూడెం రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.రమ్య సోమవారం తీర్పునిచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. 2014 జూన్ ఐదో తేదీన రాత్రి 7 గంటల సమయంలో అప్పటి నిడమర్రు ఎఎస్‌ఐ, కానిస్టేబుల్ భువనపల్లి సెంటర్లో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్నారు. నిడమర్రుకు చెందిన రెడ్డి బాలాజీ వాహనాన్ని ఆపి రికార్డులు చూపించాలని అడగ్గా ఆయన పోలీసులతో వాగ్వాదానికి దిగి దుర్భాషలాడాడు. అదే గ్రామానికి చెందిన మైలవరపు బాలయ్య, మైలవరపు నరేంద్ర, మైలవరపు కొండ, మైలవరపు గంగరాజు తదితరులు అక్కడకు వచ్చారు. బాలయ్య బండిని రోడ్డుకు అడ్డుగా నిలిపి సిబ్బందిపై దూషణకు దిగారు. ఈ ఘటనపై సెక్షన్ 353 సెక్షన్ 506 ఐపిసి కింద కేసు నమోదైంది. కేసు విచారణ అనంతరం ముద్దాయిలపై నేరం రుజువు కావడంతో ఒక్కో ముద్దాయి పదివేల రూపాయలు చొప్పున జరిమానా చెల్లించాలని, జరిమానా చెల్లించని పక్షంలో నెల రోజులు జైలు శిక్ష అనుభవించాలని జడ్జి తీర్పునిచ్చారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలో దిగమర్రు బైపాస్ వద్ద శశి స్కూల్ వద్ద సోమవారం మహిళ మెడలోని బంగారు గొలుసును దుండగులు తెంపేశారు. పోలీసుల వివరాల ప్రకారం. మొగల్తూరు మండలం రామన్నపాలెం గ్రామానికి చెందిన కొప్పర్తి అనంతలక్ష్మి తన భర్తతో కలిసి తూర్పుగోదావరిలో తన కుమార్తె ఇంటికెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగిందన్నారు. మూడు కాసుల బంగారు గొలుసును బైక్‌పై వచ్చిన వ్యక్తి తెంపేసుకుని వెళ్లిపోయాడని బాధిత మహిళ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఉపాధి హామీపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

ఇరగవరం: ఉపాధి హామీ అవసరాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించి దానిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని రేలంగి పంచాయతీ పరిధి గమళ్లపాలెంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున రెండు పూటలా పని చేయలేకపోతున్నామ, ప్రభుత్వం కూలి పెంచాలని వీరభద్రరావు వద్ద కూలీలు వాపోయారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా రోజు కూలి రూ.600 చెల్లించే విధంగా ప్రభుత్వం ఆలోచించాలన్నారు. చేసిన పనికి సకాలంలో వేతనాలు చెల్లించాలన్నారు. రెండు పూటలా పని, మస్తరు విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేబ్రోలు బాలాజీ, ఇర్రింకి నాగరాజు, ఏకుల ఆదిలక్ష్మి, చేబ్రోలు వెంకటలక్ష్మి, కోమటి నాగలక్ష్మి, కాసగాని గంగన్న పాల్గొన్నారు.

పిల్లలను సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంచాలి

సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - పాలకొల్లు

పిల్లలను సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంచాలంటే ముందు తల్లిదండ్రులు పిల్లలు ఇంట్లో ఉండగా సెల్‌ఫోన్‌కు వాడరాదని సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ కోరారు. స్థానిక వైష్ణవి హైస్కూల్లో ఆదివారం రాత్రి జరిగిన హైస్కూల్ వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులే పిల్లలకు మొదటి గురువులని చెప్పారు. పిల్లలు తల్లిదండ్రులను అన్నీ కావాలని అడుగుతారని, తెల్లవారుజామున లేపమని ఎందుకు అడగరని విద్యార్థులను ప్రశ్నించారు. చదివిన స్కూళ్లకు ముఖ్య అతిథిగా రావడానికి పిల్లలు కృషి చేయాలని కోరారు. అప్పుడే తల్లిదండ్రులు నిజంగా ఆనంద పడతారని చెప్పారు. మాతృభాషలో పట్టుఉంటే ఏ సబ్జెక్టు, ఎన్ని భాషలైనా బాగా వస్తాయని చెప్పారు. చిన్నతనం నుంచి భగవద్గీత శ్లోకాలు చెబుతున్న తెలుగు టీచర్‌ను ఆయన సత్కరించారు. విలువలతో కూడిన విద్య నేర్పుతున్న స్కూల్ కరస్పాండెంట్ బి.శ్రీనివాస్ రమను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కాలేజీ పూర్తయ్యాక రైలు ప్రమాదంలో రెండు కాళ్లూ పోగొట్టుకున్నా ఇతరులకు రోల్ మోడల్‌గా నిలిచి వేదాంతం సదాశివ మూర్తి దంపతులను ఘనంగా సత్కరించారు.



ప్రతిభా విద్యార్థులను అభినందిస్తున్న సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : పివిఎల్

ప్రజాశక్తి - కాళ్ల

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా అర్హులందరికీ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. కోపల్లెలో 5వ రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు మాట్లాడుతూ మూడున్నరేళ్లలో సిఎం జగన్మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు, జెడ్‌పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, సర్పంచుల ఛాంబర్ జిల్లా అధ్యక్షులు కొలుకులూరి ధర్మరాజు, సొసైటీ ఛైర్మన్లు వేగేశ్న జయ రామ కృష్ణంరాజు, పెన్మెత్స ప్రసాదరాజు, సాగిరాజు హరివర్మ, దంతులూరి కోటిరాజు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు **పాలవలస అప్పారావు గారి కుమారుడు పాలవలస యుగంధర్, తాడేపల్లిగూడెం, 2) మునగాల వాణిశ్రీ, భర్త : లేటు వెంకటేశ్వర రావు, నివాసం : విశాఖపట్నం** గారు నాకు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా...,

నా క్లయింటు అమ్మమ్మ గారైన **శ్రీమతి మంగి అచ్చాయమ్మ** గారి ఆస్తులు ఆమె మరణానంతరం నా క్లయింట్ల **తల్లిగారైన శ్రీమతి పాలవలస అరుణ మరియు పిన తల్లి గారైన శ్రీమతి కరణం భారతి** అను వారులకు సంక్రమించినది. నా క్లయింటు తల్లి గారైన శ్రీమతి పాలవలస అరుణకు గల వాటా ఆస్తులలో నా క్లయింట్లు మరియు వారి ఇతర సోదరులకి కూడా జాయింటు హక్కులు కలవు. పై ఆస్తులన్నింటిపై హైకోర్టులో అప్పీలు పెండింగులో ఉన్నది. ఎ.ఎస్.నెం.931/2017 నా క్లయింట్లు తల్లిగారు ఇటీవల సదరు ఆస్థులను అమ్మివేయుటకు ప్రయత్నించుచున్నట్లుగా నా క్లయింట్లకు తెలియవచ్చినది. మంగి అచ్చాయమ్మ గారి ఆస్థులలో నా క్లయింట్లకు కూడా హక్కు కలదు. కావున సదరు మంగి అచ్చాయమ్మ గారి ఆస్థులపై నా క్లయింట్లు అనుమతి లేకుండా ఏవిధమైన అన్యాక్రాంతములు జరిపినా చెల్లవని ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయడమైనది.

స్థలం : ఏలూరు **తేది : 17.04.2023**

ఇట్లు : **బి. గౌరీ శంకర్,** (అడ్వకేట్)
ఏలూరు సెల్ : 74162 36226

ప్రకటన

నా క్లయింటు విశాఖపట్టణం కాపురస్తులు అయిన **శ్రీమతి కరణం భారతి, భర్త : బాబూరావు** గారు నాకు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా...,

నా క్లయింటు తన సోదరి అయిన **శ్రీమతి పాలవలస అరుణ, తండ్రి : లేటు అప్పారావు** గారి పై తమ తల్లి గారైన **శ్రీమతి మంగి అచ్చాయమ్మ** గారి ఆస్తులు పంపకం నిమితం ఏలూరు జిల్లా కోర్టులో ఓ.ఎస్.నెం.24/2010కు దావా దాఖలు చేసినారు. సదరు దావా ది.28.04.2017వ తేదీన ప్రిలిమినరీ డిక్రీ పాస్ చేసినారు. ఆ తీర్పు పై పాలవలస అరుణ హైకోర్టులో అప్పీలు ఎ.ఎస్.నెం.931/2017 అప్పీలు దాఖలు చేసినారు. సదరు అప్పీలు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నది. ఇటీవల పాలవలస అరుణ మరియు ఆమె సంతతివారు మంగి అచ్చాయమ్మ గారి ఆస్థులు అన్యాక్రాంతం చేయుటకు ప్రయత్నించుచున్నట్లు నా క్లయింటుకు తెలియవచ్చినది. కావు ఇందుమూలముగా యావన్మందికీ తెలియచేయునది ఏమనగా సదరు మంగి అచ్చాయమ్మ గారి ఆస్థులు కోర్టు పరిధిలో ఉన్నందున ఏ విధమైన లావాదేవీలు జరిపినా చెల్లవని తెలియచేయడమైనది.

స్థలం : ఏలూరు **తేది : 17.04.2023**

ఇట్లు : **బి. గౌరీ శంకర్,** (అడ్వకేట్)
ఏలూరు సెల్ : 74162 36226

In The Court Of The Principal Junior Civil Judge :: Tanuku
O.S.No. 185/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru ***...Plaintiff***
VS
Thonta Peddintlu another ***...Defendant***

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1) తొంట పెద్దింట్లు, భర్త: భాస్కరరావు, హిందువు, స్త్రీ, 32 సం॥లు, డో.నెం. 25-11-11/1, పాలకొల్లు, పాలకొల్లు JCJC.
2) వేముల శ్రీనివాసు, తండ్రి: భాస్కరరావు, హిందువు, పురుషుడు, 49 సం॥లు, డో.నెం. 22-5-8, పాలకొల్లు, పాలకొల్లు JCJC.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది.19-04-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను** అట్లు కాని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

T.RAMADEVI
Advocate, Tanuku.

In The Court Of The Principal Junior Civil Judge :: Tanuku
O.S.No. 297/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru ***...Plaintiff***
VS
Arepalli Suresh another ***...Defendant***

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1) ఆరేపల్లి సురేష్, తండ్రి: సత్యనారాయణ, హిందువు, పురుషుడు, 53 సం॥లు, డో.నెం. 18-4-20/2 పాలకొల్లు.
2) వేముల వెంకట లక్ష్మి, భర్త: వర్ధనరావు, హిందువు, స్త్రీ, 36 సం॥లు, డో.నెం. 27-4-18, పాలకొల్లు.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది.19-04-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను** అట్లు కాని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

N.RAVI SHANKAR
Advocate, Tanuku.

In The Court Of The Principal Junior Civil Judge :: Tanuku
O.S.No. 173/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru ***...Plaintiff***
VS
Katta Vinod another ***...Defendant***

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1) కట్టా వినోద్, తండ్రి: వెంకట్రావు, హిందువు, పురుషుడు, 50 సం॥లు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, నర్సాపురం JCJC.
2) వేముల జయరాజు, తండ్రి: యర్రియ్య, హిందువు, పురుషుడు, 45 సం॥లు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, నర్సాపురం JCJC.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది.19-04-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను** అట్లు కాని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

T.RAMADEVI
Advocate, Tanuku.

In The Court Of The Ist Additional Junior Civil Judge :: Tanuku
O.S.No. 562/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Tanuku ***...Plaintiff***
VS
Veligatla Subhashini another ***...Defendant***

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1) వెలిగట్ల సుభాషిణి, భర్త: రాజేశ్వరరావు, హిందువు, స్త్రీ, 38 సం॥లు, డో.నెం. 3-68, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.
2) రేలంగి నరసింహమూర్తి, తండ్రి: వెంకట్రావు, హిందువు, పురుషుడు, 50 సం॥లు, డో.నెం. 24-15-19, పాలకొల్లు.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది.19-04-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను** అట్లు కాని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

N.RAVI SHANKAR
Advocate, Tanuku.

In The Court Of The Principal Junior Civil Judge :: Tanuku
O.S.No. 285/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru ***...Plaintiff***
VS
Thonta Prabhakara Rao another ***...Defendant***

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1) తొంట ప్రభాకరరావు, తండ్రి: సత్యనారాయణ, హిందువు, పురుషుడు, 52 సం॥లు, డో.నెం. 25-14-11/1, పాలకొల్లు.
2) తొంట జ్యోతిలక్ష్మి, భర్త: శ్రీనివాసరావు, హిందువు, స్త్రీ, 41 సం॥లు, డో.నెం. 25-8-12, పాలకొల్లు.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది.19-04-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను** అట్లు కాని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

N.RAVI SHANKAR
Advocate, Tanuku.

In The Court Of The Ist Additional Junior Civil Judge :: Tanuku
O.S.No. 556/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Tanuku ***...Plaintiff***
VS
Katta Ramachandrarao another ***...Defendant***

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1) కట్టా రామచంద్రరావు, తండ్రి: గురుమూర్తి, హిందువు, పురుషుడు, 51 సం॥లు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.
2) వేముల బాలఫణి, తండ్రి: యర్రయ్య, హిందువు, పురుషుడు, 38 సం॥లు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది.19-04-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను** అట్లు కాని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

N.RAVI SHANKAR
Advocate, Tanuku.